# ప్రతిపల్లె అభివృద్ధి చెందాలి

- అలంపూర్ఎమ్మెల్యే విజయుడు
- రూ.28లక్షలతో సీసీరోడ్డుకు భూమిపూజ

అలంపూర్ చౌరస్తా, ఫిబవరి 22: అలంపూర్ నియోజకవర్గంలో ప్రతిపల్లె అభివృద్ధి దిశగా నడవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో 100 పడకల దవాఖాన ఎదుట సీసీరోడ్డుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పర్యటిస్తున్నానని.. ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. సీసీరోడ్డు నిర్మాణానికి రూ.28లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ శ్రీనివాసులు, ఏఈ బాలకృష్ణ, గజేందర్‌రెడ్డి, రఘురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అలంపూర్ చౌరస్తాలో సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

# నోటీసులివ్వకుండానే మళ్లీ సర్వే

- 'పేట-కొడంగల్' భూసేకరణ తంతు
- పోలీస్ పహారాలో సర్వే చేపడుతున్న అధికారులు
- పొలాల వద్దకు వస్తే రైతులను అడ్డుకుంటున్న పోలీసులు
- భూమి పోతుందనే దిగ్భ్రాంతికి గురై దవాఖానలో చేరిన రైతు
- ప్రాణాలకన్నా.. సీఎం ఆదేశాలే ఎక్కువయ్యాయా అంటూ ఆగ్రహం

మక్తల్, ఫిబ్రవరి 22: సీఎం రేవంత్‌రెడ్డి కలల ప్రాజెక్టు అయిన నారాయణపేట-కొడంగల్ ఎత్తి పోతల పథకం ఏర్పాటుకు చేపడుతున్న భూ సేకరణ సర్వే రైతుల పాలిట శాపంగా మారింది. రైతులకు సమాచారం ఇవ్వకుండానే అధికారులు పోలీసుల సహకారంతో పొలాల్లో సర్వే చేస్తున్నారని మక్తల్ మండలం కాట్రేవుపల్లికి చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. అయితే మూడు రోజుల కిందట రైతులు తమకు నోటీసు ఇచ్చిన తర్వాతనే సర్వే చేపట్టాలని రైతులు కోరగా.. అధికారులు రెండు రోజులు సర్వేకు విశ్రాంతి ఇచ్చారు. శనివారం మళ్లీ రైతులకు నోటీసు ఇవ్వకుండా పోలీసుల పహారాతో సర్వే చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు అధికారులను అడుగుదామని వెళ్తుంటే పోలీసులు అడ్డుకొని అధికారులను కలువనీయకుండా దొంగల్లా చూడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఏండ్ల తరబడి వ్యవసాయన్ని నమ్ముకొని బతుకుతున్న రైతులకు నారాయణపేట-కొడంగల్ ఎత్తి పోతల పథకం ప్రాజెక్టుతో సావు తప్పా.. మరేదిక్కులేదని బోరున విలపిస్తున్నారు. ఎత్తి పోతల పథకంలో భూమిని కోల్పోతున్న రైతులకు అధికారులు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా పొలాల్లోకి వచ్చి సర్వే చేస్తూ జెండాలు పాతుతున్న విషయాన్ని తట్టుకోలేక కాట్రేవుపల్లికి చెందిన ఊషన్న గౌడ్ దవాఖాన పాలయ్యాడు. ఉన్న భూమి ప్రాజెక్టు నిర్మాణంలో పోతుందని, అనారోగ్యం బారిన పడాల్సిన దుస్థితి తలెత్తిందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల అభిప్రాయ సేకరణ చేయకుండా, సమాచారం అందించకుండా పోలీసు బలగాలతో అధికారులు భూసేకరణ సర్వే చేపట్టడం చూస్తుంటే, వీరికి రైతుల ప్రాణాల కంటే సీఎం ఆదేశాలే ఎక్కువని పలువురు రైతులు వాపోతున్నారు.


కాట్రేవుపల్లి శివారులో పొలాలకు వెళ్లకుండా రైతులను అడ్డుకుంటున్న ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి



ప్రమాదం జరిగిన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్

# సన్నగిల్లుతున్న ఆశలు

## సొరంగంలో చిక్కుకుపోయిన 8 మంది కార్మికులు

- శ్రీశైలం ఎడమగట్టు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో భారీ ప్రమాదం
- 14 కి.మీ. వద్ద మూడు మీటర్లు కుప్పకూలిన పైకప్పు
- ప్రాణాలతో తప్పించుకున్న 42 మంది
- ముమ్మరంగా సహాయక చర్యలు
- పర్యవేక్షించిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇంజినీరింగ్ అధికారులు
- ఘటనా స్థలానికి చేరిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందం
- నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఘటన


సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రులు

అచ్చంపేట/ దోమలపెంట, ఫిబ్రవరి 22 : నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్ మండలం దోమలపెంట శ్రీశైలం ఎడమగట్టు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో భారీ ప్రమాదం చోటుచేసుకున్నది. ఈ ప్రమాదంలో 42మంది కార్మికులు, ఇంజినీర్లు ప్రాణాలతో బయటపడగా.. మిగిలిన ఎనిమిది మంది ప్రమాదంలో చిక్కుకోగా వారికోసం ఉదయం నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన దేశ వ్యాప్తంగా విస్తరించింది. ప్రధానమంత్రి మోదీ సీఎం రేవంత్‌రెడ్డికి కాల్‌చేసి వివరాలు అడిగారు. ప్రమాదంలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు కావాల్సిన సహాయక చర్యలు కేంద్రం అందిస్తుందని పేర్కొన్నారు. జరిగిన ఘటనపై సీఎం రేవంత్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణం సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని కేటీఆర్ ట్వీట్ చేశారు. క్షతగ్రాతులకు మెరుగైన వైద్యసేవలు అందించి, టన్నెల్‌లో చిక్కుకున్నవారిని సురక్షితంగా బయటకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని సూచనలు చేశారు.

### ప్రమాదం జరిగిందిలా..

నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందించేందుకు అమ్రాబాద్ మండలం దోమలపెంట వద్ద సుదీర్ఘ విరామం తర్వాత ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు పునః ప్రారంభించారు. నాలుగు రోజుల కిందట పనులు ప్రారంభించారు. రోజువారీగా పనులు మొదలుపెట్టినట్లే శనివారం ఉదయం 8 గంటలకు ఫస్ట్‌షిఫ్ట్‌లో సుమారు 50మంది కార్మికులు, ఇంజినీర్లు సొరంగంలో పనులు చేసేందుకు లోపలికి వెళ్లారు. వెళ్లిన అరగంటకే ప్రమాదం సంభవించింది. ఏదైతే టన్నెల్ బోర్ మిషన్(టీబీఎం) వద్ద పని మొదలుపెట్టారో అక్కడికి నీరు, మట్టి చేరుతుండడంతోపాటు ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో పనుల్లో ఉన్న కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఒకేసారి దాదాపు మూడు మీటర్ల మేర పైనుంచి కాంక్రీట్ పెచ్చులు పడిపోవడంతో భూకంపం వచ్చినట్లుగా భారీ శబ్దం రావడంతో సొరంగంలో భారీ శబ్దంతో ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ తీవ్రత వల్ల దాదాపు వెయ్యి క్యూబిక్ మీటర్ల రాళ్లు, మట్టి పెరుకుపోయాయి. దీంతో ఆందోళనలో ఉన్న కార్మికులు, ఇంజినీర్లు మిషనరీ వదిలేసి దాదాపు 42మంది కార్మికులు, ఇంజినీర్లు బయటకు పరుగులు తీశారు. బయటకు రావడంతోపాటు వీలున్నంతవరకు సిబ్బందిని బయటకు తీసుకొచ్చారు.150మీటర్ల వరకు ప్రమాద తీవ్రత కనిపించిందని అధికారులు తెలిపారు. ఈ భారీ ప్రమాదంలో కార్మికులు, ఇంజినీర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగులు తీసీ ప్రాణాలు కాపాడుకున్నారు. అందరు సురక్షితంగా బయటపడగా నలుగురు కార్మికులకు స్వల్ప గాయాలు కావడంతో జెన్‌కో దవాఖానలో చికిత్స అందించారు. భారీగా కూలీపడిన పెచ్చులు, మట్టి పెల్లలు, కాంక్రీట్ పెల్లలతోపాటు టన్నెల్‌లో నీరు చేరిపోవడంతో టన్నెల్ బ్లాక్ అయిందని అధికారులు అంటున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోగా తర్వాత సరఫరానును పునరుద్ధరించారు. టన్నెల్ బోర్‌మిషన్ మీద ఉన్న వారు, వెనుకభాగంలో ఉన్నవారు, బయటకు రాగలిగారు. మిషన్ ముందుభాగంలో ఉన్నవారు అందులో చిక్కుకున్నారు. లోపల చిక్కుకున్న వాళ్లు కూడా బయటకు వస్తారని ఎదురుచూశారు. కాని ఎంతసేపటికీ వారు రాకపోవడంతో లోపల ప్రమాదంలోనే చిక్కుకున్నట్లు భావించిన కంపెనీ అధికారులు వారిని బయటకు రప్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. టన్నెల్ తవ్వకాలు మొదలుపెట్టిన ఏజెన్సీ నిర్వాహకులు చెప్పే కథనం ప్రకారం.. అకస్మాత్తుగా లోపలికి నీరు, మట్టి 8కిలోమీటర్ల మేర రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని భావించాల్సి ఉంటుందని తెలిపారు.



సహాయక చర్యలు చేపట్టేందుకు వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, శనివారం ఉదయం షిఫ్ట్‌నకు వెళ్లి వచ్చిన కార్మికులు



### ఘటనా స్థలిని పరిశీలించిన మంత్రులు, ఎంపీ

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఈ తరహా ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం దోమలపెంట వద్ద ప్రమాదం జరిగిందన్న విషయం తెలుసుకొని హుటాహుటిన హెలికాప్టర్ ద్వారా ఘటనా స్థలికి చేరుకున్నారు. ఘటనాస్థలిని పరిశీలించడంతోపాటు లోపల చిక్కుకున్న వారిని కాపాడడం కోసం అవసరమైన చర్యలు తీసుకునేందుకు దోమలపెంటలోని జేపీ గెస్ట్‌హౌజ్‌లో సహచర మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి తెలంగాణ అగ్నిమాపక, రెస్క్యూటీం డీజీ నారాయణరావు, ఐజీ సత్యనారాయణ, కలెక్టర్ బాదావత్ సంతోష్, రాబిన్ సంస్థకు చెందిన లెన్ మైనార్ట్‌తో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఎనిమిదిని సురక్షితంగా కాపాడడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డి పనిచేస్తుందన్నారు. అందుకు సింగరేణికి చెందిన రెస్క్యూటీంలు రంగంలోకి దిగాయని, భారత ఆర్మీకి చెందిన రెస్క్యూటీంలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడామని ఈ రాత్రి వరకు ఆ టీం దోమలపెంటకు చేరుకుంటుందని తెలిపారు. ఉత్తరాఖండ్‌లో ఈ తరహా ప్రమాదం చేసుకున్నప్పుడు రంగంలోకి దిగి ప్రాణాపాయం లేకుండా కాపాడిన టీంను కూడా రంగంలోకి దింపనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సహాయ, సహకారాలు అందిస్తున్నాయన్నారు. సాయంత్రం ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు.

### చిక్కుకున్న ఉద్యోగులు, కార్మికులు వీరే..

టన్నెల్ ప్రమాదంలో లోపల చిక్కుకున్న 8మంది ఉద్యోగులు, కార్మికుల వివరాలను కంపెనీ అధికారులు వెల్లడించారు. మనోజ్‌కుమార్ ఉత్తరప్రదేశ్, శ్రీనివాస్ ఉత్తరప్రదేశ్, సందీప్‌సాహూ కార్మికుడు జార్ఖండ్, జటాక్స్ కార్మికుడు జార్ఖండ్, సంతోష్‌సాహూ కార్మికుడు జార్ఖండ్, అనూజ్‌సాహూ కార్మికుడు జార్ఖండ్, సన్నీసింగ్ కార్మికుడు జమ్ముకశ్మీర్, గురుప్రీత్‌సింగ్ కార్మికుడు పంజాబ్ ఉన్నారు.

### శ్రమిస్తున్న అధికార యంత్రాంగం

సమాచారం అందిన వెంటనే కలెక్టర్ బాదావతసంతోష్, ఎస్పీ గైక్వాడ్ రఘునాథ్ దోమలపెంటకు వెళ్లి సభాస్థలిని పరిశీలించారు. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ డీజీ ఆధ్వర్యంలో రెస్క్యూ టీంలు పనిచేస్తున్నాయి. ఐజీ సత్య నారాయణ ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం భద్రతా చర్యలు చేపట్టారు. నీటి పారుదల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన వైద్యసేవల కోసం వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. ఆర్మీ రెస్క్యూటీం, సింగరేణి రెస్క్యూటీం టన్నెల్‌లో ఈ తరహా ఘటన చోటు చేసుకున్నప్పుడు కాపాడే రెస్క్యూ టీంలు రాత్రికి చేరుకోనున్నాయని అధికారులు తెలిపారు. అధికార యంత్రాంగం రాత్రిమొత్తం అక్కడే ఉండి సహాయక చర్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# అక్రమ నిర్మాణం కూల్చివేత

- అధికారులు, పీఏసీసీఎస్ చైర్మన్ మధ్య వాగ్వాదం
- కొంత సమయం కావాలన్నా.. వినిపించుకోని పోలీసులు
- అడ్డొచ్చినవారిని నెట్టేసి ప్రహరీ నిర్మాణాన్ని కూల్చివేసిన వైనం


అక్రమ కట్టడాలను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

లింగాల, ఫిబ్రవరి 22: మండలంలోని అంబట్‌పల్లిలో సర్వే నెంబర్ 732లో 5.29గంటల భూమి ఉన్నది. అందులో కొంతమేరకు అక్రమంగా నిర్మించిన ప్రహరీ నిర్మాణాన్ని పోలీసుల బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో శనివారం తెల్లవారు జామున కూల్చివేసిన ఘటన చోటుచేసుకున్నది. వారం రోజుల కిందట జిల్లా, మండల సర్వేయర్లు వచ్చి సర్వే చేసి మార్కు వేశారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించడానికి గురువారం రెవెన్యూ అధికారులు రాగా.. బాధితులు, గ్రామస్తులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. కాగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాసీల్దార్ పాండునాయక్, ఎంఆర్ఐ సీతారాం శనివారం తెల్లవారు జామున 4గంటల సమయంలో ప్రహరీ నిర్మాణాన్ని తొలగించారు. ప్రహరీ తొలగిస్తుండగా అధికారులు, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. కొంత సమయం ఇవ్వాలని సింగిల్ విండో చైర్మన్ అధికారులను విన్నవించుకున్నా.. పోలీసులు అడ్డొచ్చిన వారిని నెట్టివేసి అక్రమ నిర్మాణాన్ని కూలగొట్టారు. 732 సర్వే నెంబర్‌లో అక్రమ కట్టడాలు నిర్మిస్తే ఎవరు అడ్డువచ్చినా ఆపే ప్రసక్తే లేదని తాసీల్దార్ పాండునాయక్ సూచించారు.

# నకిలీ ధ్రువపత్రాలతో సర్కారు కొలువులు

- ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొగిలయ్య



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగిలయ్య

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 22 : వ్యవసాయ శాఖలో నకిలీ ధ్రువపత్రాల పొంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మొగిలయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన డీఎస్పీ వివరాలు వెల్లడించారు. 2017 సంవత్సరంలో మల్దకల్‌లో విధులు నిర్వహించిన నరేశ్‌కు మార్ నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగం పొందాడనే వ్యవహారం బయటికి పొక్కింది. ఈ వ్యవహారంపై వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ దృష్టి సారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన నరేశ్‌కుమార్, నాగరాజు మధ్యవర్తి బాలకృష్ణతో కలిసి ఉత్తరప్రదేశ్‌లోని ఫరీదా పూల్, హాజీపూర్ యూనివర్సిటీల నుంచి అగ్రికల్చర్ డిప్లామా పట్టాలు పొందారన్నారు. ఇందుకు రూ.90వేల నుంచి రూ.లక్షా 20వేల వరకు డబ్బులు అందించినట్లు తెలిపారు. మధ్యవర్తి బాలకృష్ణ పరారీలో ఉన్నాడని, అదుపులోకి తీసుకొని త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సీఐ శ్రీను, ఎస్సై కల్యాణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# వీధికుక్కల దాడి

- వ్యక్తికి తీవ్ర గాయాలు


కుక్కల దాడిలో గాయపడిన రాజు

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 22 : కుక్కల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన కొల్లాపూర్ పట్టణంలో శనివారం చోటుచేసుకున్నది. పట్టణానికి చెందిన రాజు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం కాలినడకన బస్టాండ్‌కు వెళ్తుండగా, తిరుమల బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా మెయిన్ రోడ్డులో వీధి కుక్కల గుంపు అకస్మాత్తుగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. దాదాపు 15 కుక్కల వరకు దాడికి పాల్పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమి గాయపడిన రాజును కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖానకు చికిత్స కోసం తరలించారు.

# నల్లమలలో దారితప్పిన శివస్వాముల గుర్తింపు

కొల్లాపూర్, ఫిబ్రవరి 22: ప్రస్తుతం చేతిలో సెల్‌ఫోన్ ఉంటే ప్రపంచం ముంగిట ఉన్నట్లే భావిస్తుంటాం కానీ సెల్‌ఫోన్‌లోని గూగుల్ మ్యాప్‌ను నమ్ముకొని నల్లమలలో దారి తప్పిపోయిన శివ స్వాముల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సి వస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన మనోజ్, గురుప్రసాద్, రాజు, గోపాల్‌తో పాటు మరికొంతమంది శివ స్వాములు మల్లేశ్వరం మీదుగా కాలినడకన శుక్రవారం శ్రీశైలానికి బయలుదేరారు. అయితే శ్రీశైల క్షేత్రానికి త్వరగా చేరుకోవాలని ఆలోచన రావడంతోనే సెల్‌ఫోన్‌లోని గూగుల్ మ్యాప్‌లో షార్ట్‌కట్‌లో శ్రీశైలంకు దారి చూపడంతో మ్యాప్‌ను అనుసరిస్తూ అడవిలో దాదాపు ఎనిమిది గంటలు ప్రయాణం చేసినా శ్రీశైలం రాకపోవడంతో దారి తప్పిపోయినట్లు గుర్తించి 100కి కాల్ చేశారు. వెంటనే స్పందించిన ఏపీ పోలీస్, ఫారెస్టు అధికారులు శుక్రవారం రాత్రి నల్లమలలో తప్పిపోయిన శివ స్వాములను గుర్తించి తిరిగి ఆత్మకూరు మండలం వెంకటాపురంలో వదిలిపెట్టారు. కాలినడకన శ్రీశైలానికి వెళ్తున్న శివస్వాములు వెంకటాపురం నుంచి ఫారెస్టు అధికారులు సూచించిన దారివెంట వెళ్లాలని పోలీస్, ఫారెస్టు అధికారులు శివ స్వాములకు విజ్ఞప్తి చేశారు.

# కేఎల్ఐ చివరి ఆయకట్టుకు నీళ్లు తగ్గించొద్దు

- కేఎల్ఐ రైతు జేఏసీ నేత రాంచంద్రారెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 22: శ్రీశైలం జలాశయంలో నీళ్లు తగ్గుముఖం పట్టడంతో కేఎల్ఐ ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొన్నది. ఎప్పుడు నీటిని తోడడం ఆపివేస్తారనే భయం రైతుల్లో నెలకొన్నది. ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టులో 29వ ప్యాకేజీ అతి పెద్దది. ఈ ప్యాకేజీ కాల్వ కింద పెద్ద ఎత్తున వరిపంట సాగవుతుందని రైతు జేఏసీ నేత రాంచంద్రారెడ్డి తెలిపారు. 29వ ప్యాకేజీ కింద 160 కిలోమీటర్ల ప్రధాన కాల్వ తోపాటు, మాడ్గుల మండలం నాగిళ్ల వరకు మరో 59కిలో మీటర్ల మేర డీ-82 కాల్వ ఉందని, అంటే 240 కిలో మీటర్ల మేర ఉన్న కేఎల్ఐ కాల్వ కింద లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేస్తున్నారని వివరించారు. విషయానికి వస్తే ఎగువ ప్రాంతమైన వనపర్తి, నాగర్‌కర్నూల్, జడ్చర్ల నియోజకవర్గాలకు చెందిన రైతులు ప్రధాన కాల్వకు గండి పడితే కింది ప్రాంతమైన కల్వకుర్తి, వంగూర్, చారకొండ, వెల్దండ, మాడ్గుల మండలాలకు సాగునీరు అందదని ఆయన చెప్పారు. శ్రీశైలంలో నీళ్లు తగ్గడంతో ఎప్పుడైనా మోటర్లు బంద్ చేస్తారనే వార్తల నేపథ్యంలో ఎగువన ఉన్న రైతులు కాల్వలకు గండ్లు పెట్టి చెరువులను నింపుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఇదే జరిగితే కల్వకుర్తి రైతాంగం అన్యాయమయ్యే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఇంజినీరింగ్ అధికారులు, ఇక్కడి ప్రజాప్రతినిధులు కేఎల్ఐ కాల్వపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాంచంద్రారెడ్డి కోరారు. ఎగువన ఉన్న రైతులు కాల్వకు గండ్లు పెడితే నీరందని దిగువ రైతులు తిరగబడే ప్రమాదం ఉందని, దీనికి ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.